# అబ్బే! ఏంలేదు
# ఇది కథ
## (ఎ మోడర్న్ లిటిల్ స్టోరీ)
## కె. చిరంజీవి

సత్య మూర్తి వీధిన వెడుతున్నాడు. ఆ వీధి హైదరాబాదు నగరంలోది. హైదరాబాదంటే తెలుసుగా? ఆంధ్ర ప్రదేశ్ రాజధాని నగరం. ఇక్కడే ఆంధ్ర, తెలంగాణా 'విప్లవాలు' చెల రేగాయి. మొన్నటి దాకావున్న ముఖ్య మంత్రి ఇప్పుడు కిమ్మన కుండా అసెంబ్లీలో కూర్చున్నాడు. ప్రస్తుతానికి డాక్టర్ చెన్నారెడ్డి నగరానికి – కాదు సుమా కల – ఈ రాష్ట్రానికంతకూ ముఖ్యమంత్రి.

కళ్లకు గంతలు కట్టు కున్నట్లు నల్లకళ్లజోడు ధరించి నడుస్తున్నాడు సత్యమూర్తి. వీధిలో ఎండ లేదు. నల్ల కళ్లద్దాలు మూర్తి ముఖాన వున్నాయి. వాటిని ప్రదర్శించాలని వాని అభిమతం.

అయినా ఈ కళ్లద్దాల వల్ల కొన్ని ప్రయోజనాలున్నాయి. అందమైన అమ్మాయిలను చూడనట్టే చూడవచ్చు. అందమైన ఆ వంపులను ఆ వంపులలోని సరళ లలిత సుగమ స్వాదు సంగీతాలను చూడవచ్చు. మరీ చిన్నపిల్లలంటే సత్యమూర్తికి యిష్టం.

ఆ మాట కొస్తే సత్యమూర్తికి యిష్టమైనవి చాలా వున్నాయి. గురుజాడ వారి కన్యాశుల్కమంటే యిష్టం. కన్యాశుల్కంలోని మధురవాణి, బుచ్చమ్మలంటే మరీమరీ యిష్టం. వెంకటేశమన్నా ఇష్టమే. వెంకటేశానికి యిష్టమైన గడ్డ పెరుగు, జామిపండ్లు మహా యిష్టం.

సత్యమూర్తి నడుస్తూన్నాడు. అటు షాపులు, ఇటు షాపులు. షాపులకు దిగువ మెట్టులాగా ఫుట్‌పాత్, ఆ దిగువ సర్వం జగన్నాథానికి మల్లె అవులించుకునివున్న సిమెంటు రోడ్డు. సిమెంటు రోడ్డయినా అక్కడక్కడా సొట్టలు పడిపోయి వుంది. ఆ సొట్టలను చూసినప్పుడు 'చిన్నారి' సొట్టబుగ్గలు గుర్తుకొస్తాయి సత్య మూర్తికి. ఆ గుంటలలో పడి ఎంతమంది స్కూటర్లవాళ్లు తమ కాళ్లుచేతులు విరిచేసుకున్నారో? 'భగ్న ప్రేమికులు' జ్ఞాపకంవచ్చి సత్యసాయి బాబాలా నవ్వుకున్నాడు సత్యమూర్తి.

ఇంతలో పది పన్నెండేళ్ల కుర్రాడు ఒకడొచ్చి మూర్తిని ఢీకొన్నాడు. సత్యమూర్తిని ఢీకొన్న సైకిలు పక్కకు పడింది. కుర్రాడు వెల్లకిలా పడ్డాడు.

సత్యమూర్తికి కోపం రాకపోగా, పైపెచ్చు, దయకలిగింది ఆ కుర్రాడి మైన ఒక్క క్షణం.

పడిపోయిన కుర్రాణ్ణి పైకి లేపాడు. ఆ కుర్రాడి నోటినుంచి ఒకేఒక మాట కలవరింతలా వినిపిస్తున్నది. – రజోలిక, రజోలిక, రజోలిక అని.

ఏమిటో? ఆ మాటకు అర్థమేమిటో ఏ భాషా నిఘంటువులోనూ లేదు.

అర్థం కాలేదు సత్యమూర్తికి.

(ప్రేరణ: ఈనాడొస్తోన్న కొన్ని అత్యాధునిక కథానికలు.)

---

ఆలోచనలు నరికి ముక్కలు ముక్కలు చేసినట్లుండవు. అలాగని అవి ఒకదానికొకటి అనుసంధించీ వుండవు... అందుకే దానిని ఆలోచనా స్రవంతి అనో, చైతన్య స్రవంతి అనో, లేదా మనోగత జీవనప్రవాహమనో అందాం.